ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 12 డిసెంబరు 2024 | 5



శ్రీలీల సందడి

రాజమహేంద్రవరంలో బుధవారం హీరోయిన్ శ్రీలీల సందడి చేసింది. ఓ షాపింగ్‌మాల్ ప్రారంభానికి వచ్చిన శ్రీలీల అభిమానులతో ముచ్చటించింది.. కొద్దిసేపు కేరింతలు కొట్టించింది..

నీటి సంఘాల ఎన్నికలకు
కౌంట్‌డౌన్



● 14న ఎన్నికలు ● గెజిట్ నోటిఫికేషన్ విడుదల

మండపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికకు కౌంట్‌డౌన్ మొదలయ్యింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ బుధవారం జారీ అయ్యింది. ఈ నెల 14న సాగునీటి సంఘాల ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం విధివిధానాలను వివరిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యానికి సాగునీటి సంఘాలను మళ్లీ బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం నడుంబిగించింది. ఎన్నికల నిర్వహణ ద్వారా ఆయా సంఘాలు చైతన్యవంతమై, సమర్థ నాయకత్వం తోడై రైతులకు మేలు జరుగుతుందని ప్రభుత్వం భావించి ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే పలు దఫాలు అనివార్య కారణాల వల్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. అయితే ఎట్టకేలకు ఈ నెల 14న ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా సాగునీటి సంఘాల ఎన్నికలకు సన్నాహాలు చేస్తున్నాయి. మూడంచెలలో కమిటీలు ఉంటాయి. మొదటిది నీటి వినియోగదారుల సంఘం..దీనిని సాధారణ సభ్యులైన రైతులు ఎన్నుకుంటారు. నీటి వినియోగదారుల సంఘానికి ఎన్నికైన వారు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు. అలాగే డిస్ట్రిబ్యూటరీ కమిటీ అంతా కలిపి ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు.

అధికారుల సన్నాహాలు

రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి 26 సాగునీటి సంఘాలు, 8 డిస్ట్రిబ్యూటరీ కమిటీలతో పాటు, ప్రాజెక్టు కమిటీకి సంబంధించి ఈనెల 14న ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఎన్నిక రోజునే కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షుల నియామకం, నీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ, ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు ఒకేరోజు జరుగుతాయని అధికారులు తెలిపారు. సాగునీటి సంఘాలు ఏర్పడితే సాగునీటి కాలువలు మురుగు కాల్వలకు రైతు సంఘాల పర్యవేక్షణలో మరమ్మతులు చేయటంతో పాటు రైతు సమస్యల పరిష్కారానికి వీలు కలుగుతుంది. వైసీపీ పాలనలో ఆలనాపాలన లేకుండా పోయిన సాగునీట సంఘాలకు సంబంధించి ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఎన్నికలు తిరిగి తెరపైకి రావటంతో రైతులకు మేలు జరగనుందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి సంఘాల పర్యవేక్షణలో ఇక ఇరిగేషన్ పనులు చకచక జరిగే అవకాశం ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.



కాన్ఫరెన్స్‌కు హాజరైన వివిధ జిల్లాల కలెక్టర్లు, చిత్రంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ కూడా ఉన్నారు

15 శాతం వృద్ధిరేటే లక్ష్యంగా

స్వర్ణాంధ్ర-2047

అమలాపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళికలు అమలుచేసి సత్ఫలితాలు సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో జిల్లాలను అగ్రగామిగా నిలిపేందుకు ప్రతీ పథకం కార్యాచరణ ప్రణాళికలను విజయవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు పిలుపునిచ్చారు. అమరావతిలో జిల్లా కలెక్టర్లతో బుధవారం ప్రారంభించిన సమావేశ వీడియో కాన్ఫరెన్సును జిల్లా అధికారులు కలెక్టరేట్‌లో వీక్షించారు. సీఎం చంద్రబాబు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 సాధనకు అన్ని రంగాల్లో సమ్మిళిత వృద్ధి రేటు సాధనపై కలెక్టర్లు శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో ప్రజల భూ హక్కులు కాపాడి భూ వివాదాలకు ముగింపు పలకాలని సూచించారు. ప్రతీ కుటుంబానికి ఒక పారిశ్రామిక వేత్త ఉండే విధంగా వివిధ పథకాలు వర్తింప చేయాలన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. అభివృద్ధి అవకాశాల కల్పనతో సంపదను సృష్టించి పేద వర్గాల ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరచాలని చెప్పారు. స్వచ్ఛభారత్ కార్యక్రమాల ద్వారా ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతీ ఇంటి నుంచి ఒక ఐటీ ఉద్యోగి ఉండాలనే లక్ష్యంతో కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. సృజనాత్మకతను వెలికి తీస్తూ నూతన ఆవిష్కరణలతో అభివృద్ధికి పట్టం కట్టే రీతిలో పునాదులు వేయాలన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి మంత్రులు, జిల్లా కలెక్టర్లు సమన్వయంగా పనిచేస్తూ సుస్థిరాభివృద్ధిని సాధించాలన్నారు. పర్యాటక రంగ అభివృద్ధితో పాటు డిజిటల్ పరిపాలన వంటి సాంకేతికతను వినియోగించి సుపరిపాలన దిశగా ముందుకు సాగాలన్నారు. జీవ వైవిధ్యాన్ని, పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ ప్రజలకు సురక్షిత జీవనం కల్పించాలన్నారు. స్వర్ణాంధ్ర -2047 సాధనకు సమ్మిళిత అభివృద్ధికి ఈ నెల 13న విజయవాడలో విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తామని ప్రకటించారు. కలెక్టర్లు తమ పనితీరును మెరుగు పరుచుకోవాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా గంజాయి, డ్రగ్స్ సరఫరా వినియోగంపై ఉక్కుపాదం మోపాలన్నారు. మెగా డీఎస్సీ అత్యంత పటిష్టంగా, పారదర్శకంగా అమలు పరచాలన్నారు. సంక్రాంతి నాటికి పల్లె పండుగ పేరుతో ప్రారంభించిన పనులను పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్సును ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రూప్సీరాణి, డీఎల్డీవో త్రినాథరావు తదితరులు వీక్షించారు.

సౌదీ అరేబియాలో ఉద్యోగాలు

అమలాపురం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బీఎస్సీ నర్సింగ్, పోస్టు బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసిన నిరుద్యోగ యువతకు సౌదీ అరేబియాలోని రిహాబిలిటేషన్ సెంటర్లలో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, అల్‌యూనఫ్ ఎంటర్‌ప్రైజెస్ సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాల కల్పనకు చర్యలు తీసుకున్నామన్నారు. ఆసక్తి గల యువత ఈ నెల 15వ తేదీలోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు గల నిరుద్యోగులు బీఎస్సీ నర్సింగ్ చదివి ఏదైన ఆసుపత్రిలో కనీసం ఏడాదిన్నర పాటు పనిచేసిన అనుభవం ఉండాలన్నారు. వీసా, విమాన టిక్కెట్లతో కలిపి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.37,500 చెల్లించాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.78వేల నుంచి రూ.89 వేల వరకు జీతం వస్తుందన్నారు. ఇతర వివరాలకు సెల్ 9988853335ను సంప్రదించాలని హరిశేషు తెలిపారు.

కారు ప్రమాదంలో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం
7లో

తొలి వితంతు వివాహానికి 143 ఏళ్లు
6లో



వివరాలు వెల్లడిస్తున్న జేసీ నిషాంతి

డాక్యుమెంట్ ఆవిష్కరణ సభకు ఏడు బస్సులు

జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో ఈ నెల 13న స్వర్ణాంధ్ర-2047 డ్యాకుమెంట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించనున్నారని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి తెలిపారు. ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు అందించే లక్ష్యంతో విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించారని తెలిపారు. డాక్యుమెంటు ఆవిష్కరణ సభకు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఏడు బస్సులను ఏర్పాటు చేసి సుమారు 350 మందిని తరలిస్తామన్నారు. రాష్ట్ర ప్రగతికి సంబంధించిన మరొక కీలక ఘట్టంగా విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ నిలుస్తుందన్నారు. పర్యటన ఏర్పాట్లపై బుధవారం జిల్లాస్థాయి అధికారులతో జేసీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆవిష్కరణ సభకు జిల్లా నుంచి 75 మంది డ్వాక్రా మహిళలను, 50 మంది ఉపాధి హామీ పథకం సభ్యులను, 25 మందిని మత్స్యశాఖ నుంచి, 40 మంది వ్యవసాయశాఖ, 40 మంది ఉద్యానశాఖ, 50 మంది విద్య అకడమిక్ విభాగం, 20 మంది వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా పరిశ్రమల శాఖ నుంచి 15 మందిని తరలిస్తామన్నారు. ఏడు బస్సులకు ఇన్‌చార్జిలను సమన్వయ అధికారులను నియమించామన్నారు. ఏ నియోజకవర్గంలో బస్సును ఎక్కడ ఉంచుతారో ఆ లోకేషన్‌ను మొబైల్ ద్వారా పంపిస్తామన్నారు. 13వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు ఆయా నియోజకవర్గాల ప్రధాన కేంద్రాల నుంచి బస్సులు బయలుదేరి 9.30 గంటలకు ఇందిరాగాంధీ స్టేడియంకు చేరుకోవాలన్నారు. తరలింపు ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఆర్డీవో, తహశీల్దార్‌ను నియమించామన్నారు. ఇందు కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, కలెక్టరేట్ ఏవో కడలి కాశీవిశ్వేశ్వరరావు, జిల్లా పరిశ్రమల కేంద్రం ఏడీ శివరామ్‌ప్రసాద్, సీపీవో వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీఎస్సీ ఎస్కేవీడీ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



బుధవారం గొల్లవిల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం



దాళ్వా నారుమడి కోసం దమ్ము చేసి ఉంచిన పొలం

దాళ్వాకు ఆదిలోనే అడ్డంకులు

వెంటాడుతున్న వర్షాలు

ఉప్పలగుప్తం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సార్వాలో నారుమళ్ల దశలో ప్రారంభమైన వాతావరణ వెతలు దాళ్వాలోనూ అన్నదాతలను వెంటాడుతున్నాయి. ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో సార్వా కోతలు ఇంకా ఒక కొలిక్కి రాలేదు. సమయానికి నాట్లు పడకపోతే దాళ్వా పంట గట్టెక్కదు. మొదటి పంట చేతికి రాకపోయినా రెండో పంట కోసం రైతులు సమాయత్తమయ్యారు. వర్షాల్లో సైతం కొంత పొలంలో పంట కోసి దాళ్వా నారుమళ్లకు దమ్ములు చేసుకున్నారు. విత్తనాలు చల్లుకుందామనుకుంటున్న సమయంలో ఫెంగల్ అడ్డగించింది. అంతగా ప్రభావం ఉండదనుకున్న ఫెంగల్ రోజుల తరబడి వర్షాలతో నారుమళ్లకు ఆటంకం కలిగించింది. ప్రస్తుతం నారుమళ్లకు సిద్ధమవుతున్న వేళ మళ్లీ అల్పపీడనం రైతులను వెంటాడుతోంది. మళ్లీ ఎన్ని రోజుల వరకు ఈ ప్రభావం కొనసాగుతుందోనని రైతులు భయపడుతున్నారు. ఇప్పటికే నారుమళ్లకు రెండు వారాలు ఆలస్యమయ్యిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాహసించి విత్తనాలు చల్లితే వర్షానికి నారుమళ్లు దెబ్బతింటాయని ఆలోచిస్తున్నారు. బుధవారం ఉదయం మండలంలో కురిసిన జోరువానకు రైతులు మరింత ఆందోళనకు గురయ్యారు. పరిస్థితి ఇలానే కొనసాగితే దాళ్వా సాగుకు మరింత జాప్యం జరిగి మొదటికే మోసం వస్తుందని రైతులు భయపడుతున్నారు.

కౌన్సిల్ అభీష్టానికి వ్యతిరేకంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పలువురు కౌన్సిలర్ల మండిపాటు



అమలాపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కౌన్సిల్ అభీష్టానికి వ్యతిరేకంగా మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఒక కాంట్రాక్టర్ అనుకున్నది సాధించారు. కౌన్సిల్ నిర్ణయంతో సంబంధం లేకుండా మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న భవనానికి విద్యుత్ సరఫరా కోసం మున్సిపల్ కార్యాలయ ప్రధాన మార్గంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేయడంతో జనసేన, టీడీపీ కౌన్సిలర్లు ఒకింత ఆగ్రహంతో ఉన్నట్టు సమాచారం. ఇటీవల అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కొన్ని కీలక అంశాలపై చర్చ జరిగింది. దీనిలో భాగంగా మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న మున్సిపల్ ఈ సేవా భవనాన్ని ప్రస్తుతం ఒక రెస్టారెంట్‌కు ఒక కాంట్రాక్టరు అద్దెకు ఇచ్చారు. వాస్తవానికి మున్సిపల్ నిబంధనల ప్రకారం ఆ భవనం లీజుదారుడే ఏదైనా వ్యాపార సంస్థను ప్రారంభించుకోవాలనే నిబంధన ఉన్నప్పటికీ ఒక రెస్టారెంటు సంస్థకు సబ్ లీజుకు ఇచ్చి ఆ భవనంలో ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఈ అంశంపై కౌన్సిల్‌లో టీడీపీ, జనసేనతో పాటు అధికార వైసీపీ కౌన్సిలర్లు కూడా ఆ భవనానికి సంబంధించిన విద్యుత్ సప్లయి చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయడం, జనరేటర్‌ను మున్సిపల్ కార్యాలయానికి చెందిన సైకిల్ స్టాండులో పెట్టడం, మరుగుదొడ్లకు సంబంధించిన పైపులైన్లు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై కౌన్సిలర్లు చర్చించి అధికారుల ఉదాసీనతపై నిరసన గళం వినిపించారు. తొలుత విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కౌన్సిల్ నిర్ణయంతో సంబంధం లేకుండా కమిషనర్ మున్సిపల్ నిధుల నుంచి దాన్ని ఏర్పాటు చేసేందుకు చేపట్టిన చర్యలపై కౌన్సిల్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ నిర్ణయాన్ని కమిషనర్ ఉపసంహరించుకుంటున్నట్టు అప్పుడే ప్రకటించారు. అయితే ఇప్పుడు కాంట్రాక్టరు సొంత నిధులతో సమకూర్చుకున్నట్టు భావిస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేయడంతో టీడీపీ, జనసేన కౌన్సిలర్లు మున్సిపల్ అధికారుల వైఖరిపై ఆగ్రహంతో ఉన్నట్టు తెలిసింది. అయితే గత మీటింగ్‌లో అభ్యంతరం వ్యక్తం చేసిన మేరకు సైకిల్ స్టాండులో పెట్టిన జనరేటర్‌ను రెస్టారెంట్ భవనంపైనే ఏర్పాటు చేసుకున్నారు. ఈ అంశం రాజకీయంగా చర్చనీయాంశమవుతోంది.



చెక్కు చెదరని చరిత్ర

కపిలేశ్వరపురం జమిందారీ సంస్థానానికి వందల ఏళ్ల చరిత్ర

దివాణం నిర్మాణానికి 144 ఏళ్లు

ఇప్పటికీ అదే రాజసంతో దర్శనమిస్తున్న ఎస్టేట్

అలనాటి జ్ఞాపకాలుగా ఫర్నిచర్, ఇతర సామగ్రి

ప్రత్యేక కథనం
6వ పేజీలో

దివాణం కోట









దివాణం గేటు.. కోట లోపల ఊగుటుయ్యాల.. మంచం.. దివాణం హాలులో నగిషీలు చెక్కిన ఫర్నిచర్





చెక్కు చెదరని చరిత్ర

కపిలేశ్వరపురం జమిందారీ సంస్థానానికి వందల ఏళ్ల చరిత్ర


దివాణం నిర్మాణానికి 144 ఏళ్లు

ఇప్పటికీ అదే రాజసంతో దర్శనమిస్తున్న ఎస్టేట్

అలనాటి జ్ఞాపకాలుగా ఫర్నిచర్, ఇతర సామగ్రి

(ఆంధ్రజ్యోతి- మండపేట)

ఇప్పుడు రాజ్యాలు లేవు. వలస పాలకులూ లేరు. వీరికి, ప్రజలకు అనుసంధానంగా కొనసాగిన జమిందారీ వ్యవస్థా నేడు లేదు. కానీ జమిందారీ వ్యవస్థ నాటి వైభవానికి సజీవ సాక్ష్యాలు ఉన్నాయి. జమిందార్లు లేకపోయినా వారు నివసించిన దివాణాలు ఉన్నాయి. వారి వారసుల సంరక్షణలో జమిందారులు వినియోగించిన వస్తు సామగ్రి ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఒక్కొక్క జమిందారీ దివాణం ఒక్కో చరిత్ర. కపిలేశ్వరపురం జమిందారీ దివాణం కూడా అందులో ఒకటి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కపిలేశ్వరపురం గ్రామంలో జమిందార్ కుటుంబానికి సంబంధించిన దివాణం భవనాలు నేటికీ పదిలంగానే ఉన్నాయి. 1880లో నిర్మించిన దివాణం భవనాలు ఆనాటి నిర్మాణం పనితనం, నైపుణ్యానికి ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. ఇక్కడ జమిందార్ దివాణం గోదావరి నది చెంతనే ఉంది. సాధారణంగా జమిందార్లు అంటే మొత్తంగా భూయజమాన్య హక్కులు కలిగినవారు. అభివృద్ధిలోను, రైతుల నుంచి పన్నుల వసూళ్లలోను కీలక భూమిక వహించేవారు. అలాగే సాహిత్య, సాంస్కృతిక కళలకు రాజపోషకులు. కపిలేశ్వరపురం జమిందార్లు కూడా తమ హయాంలో సాంస్కృతిక వైభవానికి పునాదులు వేశారు. వాటిలో భాగమే వేద పాఠశాల, హరికథ పాఠశాలలు ప్రారంభమై నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. కపిలేశ్వరపురం ఎస్టేట్‌కు వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఈ ఎస్టేట్‌ను సంపాదించిన బలుసు వంశీయులు, 1635లో దుర్జయ వంశస్తులు కాకతీయ రాజ సంతతికి చెందిన శ్రీబలుసు నాగినీడు తొలి జమిందార్‌గా వ్యవహరించారని పూర్వపు చరిత్ర చెబుతోంది. ఆ తర్వాతకాలంలో బ్రిటీష్ పాలనలో ఆంగ్లేయుల నుంచి 1818లో బలుసు పెద సర్వారాయుడు ఈ జమీ పొందారు. కపిలేశ్వరపురం జమీలో ఆరు శివారు లంకలు ఉండేవి. 1847లో పెదసర్వారాయుడు చనిపోగా, ఆయన కొడుకు బుచ్చి కృష్ణయ్య పాలనకొచ్చారు. ఆయన 1852లో ఆరు గ్రామాలు ఉన్న కేశనకుర్రు సంస్థానాన్ని రాజా దంతులూరి బుచ్చి కృష్ణంరాజు నుంచి కొనుగోలు చేసి విస్తరించారు. ఎన్నో ప్రజా కార్యక్రమాలు చేపట్టారు. బుచ్చి కృష్ణయ్య 1857లో చనిపోయారు. తర్వాత జమిందార్ అయిన ఆయన సోదరుడు పట్టాభిరామయ్య 1866లో చనిపోయారు. ఆయన భార్య రామలక్ష్మమ్మ తన పాలనలో పెద్ద సత్రం నిర్మించి అనేక సేవా కార్యక్రమాల ద్వారా మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఆమె దత్తపుత్రుడు పట్టాభిరామయ్య 1896లో చనిపోగా, మరో ఇద్దరి సంరక్షించింది. 1906లో ఈమె చనిపోగా, బలుసు బుచ్చిసర్వారాయుడు జమిందార్ అయ్యారు. ఈయన 1913లో పెద్ద



బుచ్చి సర్వారాయుడు



సత్యన్నారాయణరావు

పాఠశాల నిర్మించి జిల్లా బోర్డుకు అప్పగించారు. ఆంగ్లేయుల ఇంపీరియల్ వ్యవసాయ పరిశోధనా సంఘానికి సభ్యుడు. చాగంటి శేషయ్య గారి రాధామాధవము, ఆంధ్ర కవితరంగిణి, సుగ్రీవ విజయము అనే గ్రంథాలను ముద్రింపజేశారు. జిల్లా బోర్డు అధ్యక్షుడిగానూ పనిచేశారు. హసనాబాద్ గ్రామాన్ని సంపాదించారు. 1945లో బ్రిటిష్ ప్రభుత్వం ఈయనకు రావు బహద్దూర్ బిరుదు నిచ్చింది. ఈ బలుసు బుచ్చి సర్వారాయుడు, లక్ష్మీ వెంకట సుబ్బామ్మారావు దంపతుల కుమారులు ఎస్‌బీ ప్రభాకర పట్టాభిరామారావు, ప్రభాకర వెంకట రామ్మోహనరావు, ప్రభాకర వెంకట చలపతి రావు, ఎస్‌బీపీబీకే సత్యనారాయణ రావు (చంటి దొర). వీరిలో ప్రభాకర రామ్మోహనరావు మద్రాసులో చదువుకుంటుండగా 17 ఏట మరణించారు. వీరిలో పట్టాభిరామారావు, సత్య నారాయణరావులు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో మంత్రు లుగా పని చేశారు. ఇద్దరూ కేంద్ర సహాయ మంత్రులుగా పనిచేయడం విశేషం. చలపతిరావు వ్యాపార రంగంలో రాణించారు. ఎంతో వైభవాన్ని పదిలపర్చు కున్న కపిలేశ్వరపురం దివాణంలో నిర్మించిన భవనానికి 144 ఏళ్లు. ఇది 1880లో నిర్మించారు. అయినప్పటికీ ఇప్పటికీ రాజసానికి చిహ్నాలుగా నిలిచే ఉన్నాయి. భవనాలే కాకుండా ఫర్నిచర్, వారు వినియోగించిన వస్తువులు అపురూపమైన సంపదగా నిలుస్తున్నాయి. ఆనాటి నిర్మాణాలు అప్పటి వారి నైపుణ్యానికి సాక్షీభూతంగా దర్శనమిస్తున్నాయి. ఈ జమిందారీ సంస్థానం మిగిలిన జమిందారీ వ్యవస్థలకన్నా భిన్నం. ఇది ప్రజలతో మమేకమైన సేవా సౌధం.

రాజమహేంద్రిలో సినీ నటి శ్రీలీల సందడి

ది చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద నిర్మించిన ది చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. 5 ఫ్లోర్లలో సువిశాలంగా దీనిని నిర్మించారు. చీరలు, డ్రెసెస్‌లు, మెన్స్‌వేర్ అన్ని రకాల వస్త్రాలతో అద్భుతమైన రంగులతో ఆఫర్ ధరలతో వస్త్రాలను అందుబాటులో ఉంచారు. ఈ షాపింగ్ మాల్‌ను సినీ నటి శ్రీలీల ప్రారంభించారు. తొలుత శ్రీలీలకు చెన్నయ్ షోరూం నిర్వాహకులు ఎం.జనార్దన్‌రెడ్డి, జమున, ఎం.వెంకటరెడ్డి, మధులత స్వాగతం పలికారు. అన్ని ఫ్లోర్లలో వస్త్రాలను, జ్యూయలరీ విభాగాన్ని శ్రీలీల పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభించడానికి రాజమహేంద్రవరం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. నాకు నచ్చిన రంగుల వస్త్రాలు చెన్నయ్ షాపింగ్ మాల్‌లో లభ్యమవుతున్నాయన్నారు. ఇటువంటి వాటి కోసం గతంలో చెన్నై వెళ్లాల్సి వచ్చేదని కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో చెన్నయ్ షాపింగ్ మాల్స్‌లో లభ్యమవుతున్నాయని పేర్కొన్నారు. తాను నటించిన రాబిన్‌హుడ్ సినిమా ఈ నెల 25న విడుదల కాబోతుందని ప్రేక్షకులు విజయవంతం చేయాలన్నారు. శ్రీలీలను చూడానికి వచ్చిన జనంతో ఆర్‌టీసీ బస్టాండ్ రోడ్డు కళకళలాడింది. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో అతిపెద్ద షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేసి 600మందికి ఉద్యోగావకాశాలు కల్పించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, నగర ప్రముఖులు హాజరయ్యారు.





చెన్నయ్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న శ్రీలీల, బంగారు ఆభరణాలతో సందడి చేస్తున్న శ్రీలీల



రాజమహేంద్రవరంలో వీరేశలింగం పంతులు నివాసంలో జరిపించిన తొలి వితంతు వివాహానికి గుర్తుగా ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద ఆంధ్ర కేసరి యువజన సమితి సభ్యులు

తొలి వితంతు వివాహానికి 143 ఏళ్లు

నాడు రాజమహేంద్రవరంలో ఆదర్శ వివాహాలకు వీరేశలింగం నాంది

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): వితంతు వివాహాలను ప్రోత్సహించి సంఘసంస్కరణ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన వీరేశలింగం పంతులు ధన్యజీవి అని ఆంధ్ర కేసరి యువజన సమితి ప్రధాన కార్యదర్శి మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. తొలి వితంతు వివాహం జరిపిన రోజును 143 ఏళ్ల తర్వాత బుధవారం కందుకూరి వీరేశలింగం జన్మ గృహంలో నిర్వహించారు. ముక్కుపచ్చలారని బాలికలను, కాసుల మీద ఆశతో పండు ముసలివారికిచ్చి పెళ్లి చేసే సంప్రదాయాన్ని వీరేశలింగం పంతులు బద్దలుకొట్టారన్నారు. నాటి నుంచి సంఘ సంస్కరణ ఉద్యమానికి సమాజంలో బీజాలు పడ్డాయని తెలిపారు. తొలి వితంతు వివాహం జరిగి 143 ఏళ్లయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామనాయుడు, కళారత్న పీవీఎస్.కృష్ణారావు, పురావస్తుశాఖ సహాయ సంచాలకులు కె.తిమ్మరాజు,పురావస్తు శాఖ ఉద్యోగి మూసా, ఆంధ్రకేసరి యువజన సభ్యులు దూర్వాసులు సత్యనారాయణ, గుడిపూడి సునీల్ గౌతం తదితరులు పాల్గొన్నారు.

21న ఉమ్మడి జడ్పీ సర్వసభ్య సమావేశం

జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు

కాకినాడ సిటీ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య, సమావేశం, 1 నుంచి 7వరకు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా పరిషత్ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి ఈ సమావేశాలు నిర్వహించనున్నామన్నారు. సర్వసభ్య సమావేశానికి జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు,స్థాయీ సంఘాల సమావేశాలకు ఆయా సంఘాల చైర్మన్‌లు అధ్యక్షత వహిస్తారన్నారు. సమావేశాలకు ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీలు, స్థాయి సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని ఒక ప్రకటనలో కోరారు.


ఉప్పాడ తీరంలో ఈదురుగాలులు

కొత్తపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో కాకినాడ జిల్లా ఉప్పాడ తీరప్రాంతాల్లో బలమైన ఈదురు గాలులు వీస్తున్నాయి. తీరం వెంబడి ఈదురుగాలులు వీస్తున్నప్పటికీ సముద్రం మాత్ర ప్రశాంతంగా ఉండటం గమనార్హం. అయితే బుధవారం ఉదయం సముద్రంపైకి వేటకు వెళ్లిన మత్స్యకారులు మధ్యాహ్నానికి ఒడ్డుకు చేరుకున్నారు.

తగ్గేదెలే...!

కలపను వస్తువులుగా తయారుచేసి తరలిస్తున్న ఉన్నతాధికారి

లారీని అడ్డుకున్న గ్రామస్తులు



భారీగా టేకు కలపతో పట్టుబడ్డ లారీ

కూనవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖలో కంచె చేను మేస్తోంది. కొంత మంది అటవీ శాఖాధికారులే స్మగ్లర్ల అవతారమెత్తి భారీగా టేకు కలపను రవాణా చేస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన అటవీ శాఖాధికారిణి (ఎఫ్ఆర్‌వో) మోహిని విజయలక్ష్మి నందిగామలో భారీగా టేకు కలప తరలిస్తూ పట్టు బడ్డారు. వాటి విలువ లక్షల్లో ఉంటుందని అంచనా. మోహిని విజయలక్ష్మి అల్లూరి సీతా రామ రాజు జిల్లా కూనవరం ఎఫ్ఆర్‌వోగా పని చేస్తూ ఏలూరు రేంజ్‌కు బదిలీ అయ్యారు. అయితే ఆమె ఈ ప్రాంతంలో విలువైన టేకు, జిట్రేగి ఉండడంతో వాటిని ఇక్కడి నుంచి ఆమె స్వగ్రామమైన తిరువూరుకు తరలిస్తున్నారని గతంలో వార్తలొచ్చాయి. తరలించిన టేకు కలపను అక్కడ లక్షల్లో విక్రయించారన్న విమర్శలు వచ్చాయి. గతంలోను ఆమె టేకు కలప తరలిస్తూ సీసీ ఫుటేజ్‌లో సైతం కనిపించారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా మోహిని విజయలక్ష్మి 3 రోజులుగా కూనవరంలో తిష్ట వేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గతంలో ఆమె పనిచేసిన సమయంలో పట్టుబడ్డ కలపను వస్తువులుగా తయారుచేసి ఆమె బుధవారం తరలిస్తుండడంతో నందిగామలో గ్రామస్తులు లారీని అడ్డుకున్నారు. దీంతో లారీపై టార్పాలిన్ తెరవగానే లక్షల్లో విలువచేసే కలప ఉండడం గమనార్హం. దీనిపై ఉన్నతాధికారులు కేసు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు.

మహాసంస్థానంలో లక్ష తులసి అర్చన



శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు ప్రత్యేక అలంకారం

పిఠాపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాల్లో భాగంగా నాల్గోరోజు బుధవారం విశేషపూజలు జరిగాయి. శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులకు లక్ష తులసి అర్చన నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య రుత్విక్కులు తులసి దళాలతో అర్చన చేశారు. అనంతరం స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. అంతకు ముందు మహాగణపతి పూజ, శ్రీపాదశ్రీవల్లభుల మహిమాన్విత దివ్య పాదపద్మములకు మహాన్యాసపూర్వక ఏకాదశ శతరుద్రాభిషేకం, శ్రీసూ క్త, పురుషసూక్తములతో సహస్ర నామార్చన, రుత్విక్కులచే దత్తమూలమంత్ర అనుష్టానము, సాయంత్ర అగ్నిప్రతిష్టాపన, దత్తమంత్రహోమం నిర్వహించి వివిధ హారతులు ఇచ్చారు. స్వామికి సాయంత్రం పల్లకి సేవ కనులపండువగా నిర్వ హించారు. పూజాది కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తదితరులున్నారు.

'పర్యావరణ అనుకూలమైన పొగాకు సాగు కోసం ఉమ్మడి ప్రణాళిక'

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్బన్ ఉద్గారాలను తగ్గించే దిశగా పర్యావరణ అనుకూలమైన పొగాకు సాగు కోసం సీటీఆర్ఐ, ఐజుసీఎల్ ఉమ్మడి ప్రణాళిక రూపొందించినట్లు సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషమాధవ్ తెలిపారు. బుధవారం సీటీఆర్ఐలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో ఇండియన్‌ఆయాల్ కార్పొరేషన్ లిమిటెడ్ హైదరాబాద్, ఎమినెంట్ గ్యాస్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒప్పందం చేసుకున్నారు. వర్జీనియా పొగాకులో కలపకు బదులుగా లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి) క్యూరింగ్ విధానానికి వాడుకనేందుకు సాంకేతికతను అభివృద్ధి చేసుకోవడం, పరిశోధనలు వేగవంతం చేసేందుకు కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలుగు రాష్ట్రాల్లో ఉన్న 40వేల పైచిలుకు ఉన్న పొగాకు బ్యారన్‌లలో ఉపయోగించే కలపను గణనీయంగా తగ్గించుకోవచ్చని రైతులకు కలప సంబంధిత సమస్యలు, ఖర్చు తగ్గుతాయన్నారు. సమావేశంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ హైదరాబాద్ జీఎం యోగరాణి సురేష్, చీఫ్ మేనేజరు పీవీ లలిత, మేనేజరు డిభాస్కర్, అసిస్టెంట్ మేనేజరు విగోపాల్ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్ల ప్రతిభ

ప్రథమస్థానంలో పురుషుల జట్టు

పిఠాపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పదోవ ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్లు ప్రతిభ కనబరిచాయి. పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో 4రోజులు పాటు జరిగిన ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పురుషులు, మహిళల జట్లు పాల్గొన్నాయి. పురుషుల విభాగంలో ఉమ్మడి జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, మహిళల జట్టు మూడో స్థానంలో నిలిచింది. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, ఆచంట ఎమ్మెల్యే పితానీ సత్యనారాయణ, జడ్పీ చైర్‌పర్సన్ పద్మజ బహుమతులు, షీల్డులు బహుకరించారు. విజేతలుగా నిలిచిన ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ క్రీడాకారులను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నమనేని చక్రవర్తి, బొజ్జా మాణిక్యాలరావు(అయలు), జాయింట్ సెక్రటరీ కృష్ణారెడ్డి, పిఠాపురం అసోసియేషన్ అధ్యక్షుడు మొగిలి కాశీవిశ్వనాథం అభినందించారు.



బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన ఉమ్మడి జిల్లా పురుషుల, మహిళల జట్ల సభ్యులు

తండ్రి మందలిస్తాడనే భయంతో
విద్యార్థి ఆత్మహత్య


జిల్లెల్ల బన్నీ

మలికిపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తండ్రి మందలిస్తాడనే భయంతో ఓ విద్యార్థి కంగారులో చింతలమోరిలోని శంకరగుప్తం డ్రెయిన్‌లోకి దూకి ఆత్మహత్య చేసుకుని తనువు చాలించాడు. దీనికి సంబంధించిన వివరాలివి. కోనసీమ జిల్లా మలికిపురం మండలం చింతలమోరి జడ్పీ హైస్కూలులో జిల్లెల్ల బన్నీ (15) అనే బాలుడు 9వతరగతి చదువుతున్నాడు. ఈనెల 10న ఇంటినుంచి వెళ్లి అతడు తిరిగి రాలేదు. ఎంతకీ ఆచూకీ దొరక్కపోవడంతో తల్లిదండ్రులు మలికిపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, బుధవారం సాయంత్రం శంకరగుప్తం డ్రెయిన్‌లో అతడి మృతదేహాన్ని చూసిన స్థానికులు వారికి సమాచారమిచ్చారు. బన్నీ తండ్రి శ్రీనివాస్ అనారోగ్యంతో బాధ పడుతుండగా తల్లి కుటుంబాన్ని పోషిస్తోంది. తండ్రి మందలిస్తాడనే భయంతోనే అతడు డ్రెయిన్‌లో దూకేసి ఉంటాడని చెప్తున్నారు. ఆత్మహత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

కొవ్వూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పంగిడి గ్రామానికి చెందిన ఆరేపల్లి అనిల్ ఈనెల 10న రాత్రి కాతేరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో డ్యూటీ ముగించుకుని బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. పంగిడి హెచ్‌పీ పెట్రోల్‌బంకు వద్దకు చేరుకునేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీట్టింది. దీంతో బైక్ పైనుంచి కింద పడిన అనిల్ తలకు తీవ్ర గాయాలయ్యాయి.108అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతుడి సోదరుడు నాగబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

రంగంపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో రంగంపేట మండలంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. రంగంపేట ఎస్ఐ తోటకృష్ణసాయి తెలిపిన వివరాలప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం ఈలకొలను గ్రామానికి చెందిన కురుకూరి అన్నవరం స్థానికంగా చికెన్‌షాపు నిర్వహిస్తున్నాడు. చికెన్‌షాప్‌లోఉన్న బాక్స్‌కి కరెంట్ ఉన్న విషయం తెలియక బుధవారం అతడు దాన్ని పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి కింద పడిపోయాడు. అతడి భార్యకు కూడా విద్యుత్‌షాక్ తగలడంతో బంధువుల సహాయంతో రామహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ధాన్యం అమ్మిన సొమ్ములు ఖర్చు చేయడంపై వివాదం

- పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్య

ఎటపాక, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ధాన్యం విక్రయించిన సొమ్ములు భర్త ఖర్చు చేయడంపై దంపతుల మధ్య వివాదం తలెత్తి క్షణికావేశంలో భర్త పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నల్లకుంటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లకుంట గ్రామానికి చెందిన గుండి నాగేష్ (56) ఇటీవల పండించిన ధాన్యంలో నాలుగు బస్తాలను అమ్మి ఆ డబ్బులు ఖర్చు చేశాడు. దీంతో బుధవారం భార్య రామమ్మ ఎందుకు ధాన్యం అమ్మిన డబ్బులను ఖర్చు చేశావని నిలదీసింది. క్షణికావేశంలో ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. నాగేష్‌ను వెంటనే భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. భార్య రామమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామిడికి బీమా!

- పంటల బీమాలో మామిడికి స్థానం
- రైతులకు ప్రభుత్వం తీపి కబురు
- ఎకరాకు ప్రీమియం కింద రూ.2,000 చెల్లించాలి
- పంటనష్టం జరిగితే ఎకరాకు రూ.40వేల పరిహారం
- ఈనెల 15తో ముగుస్తున్న గడువు



సామర్లకోట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎన్నో దశాబ్దాలుగా మామిడి రైతులు డిమాండ్ చేస్తున్న బీమా సదుపాయాన్ని కల్పించింది. ఈ మేరకు మామి డి రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది. పునర్‌వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్(రీస్ట్రక్చర్ వెదర్ బేస్‌డ్ క్రాప్ ఇన్సూరెన్స్ స్కీం)లో మామిడిని చేర్చింది. దీంతో ప్రతికూల పరిస్థితుల్లో పంటను కోల్పోయే మామిడి రైతులకు గణనీయంగా ఉప శమనం లభించనుంది. కూటమి సర్కారు తీసు కున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంతోపాటు జిల్లాలోని మామిడి రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో గణనీయంగా సాగు

ఉమ్మడి తూర్పు జిల్లాలో గణనీయంగానే మామిడి సాగు ఉంది. కాకినాడ జిల్లాలో 18,252 ఎకరాల్లోను, తూర్పుగోదావరి జిల్లాలో 20,500 ఎకరాల్లోను, కోనసీమలో 12,000 ఎకరాల్లోను మామిడి సాగు జరుగుతోంది. ఈ పంట మీద 10వేలమంది రైతులు ఆధారపడి ఉన్నారు. కాకినాడ జిల్లాలో తుని, తొండంగి, రౌతులపూడి, శంఖవరం, జగ్గంపేట, పెద్దాపురం మండలాల్లోను, తూర్పుగోదావరి జిల్లాలో రంగంపేట, రాజానగరం, గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో, కోనసీమలోను పలుచోట్ల మామిడితోటల సాగు జరుగుతోంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో లభిస్తున్న ప్రోత్సాహకాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా మామిడితోటల సాగు గణనీయంగా పెరిగింది. కానీ బీమా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మామిడి పంటకు బీమా వర్తింపచేయాలని ఏళ్ల తరబడి రైతులు పోరాడుతున్నారు. వారి పోరాటం ఫలించి కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్‌లో చోటు

అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతోపాటు ఆర్థిక నష్టాల నుంచి రైతులను ఆదుకునేందుకు రాష్ట్రంలో రబీ సీజన్(2024-25)లో పునర్‌వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా(ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) పథకాన్ని మామిడికి వర్తింపజేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు జారీ చేసిన ఉత్తర్వులు మంగళవారం జిల్లా ఉద్యానవనశాఖ కార్యాలయానికి చేరుకున్నాయి. ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ అమలవుతున్న జిల్లాల్లో కాకినాడ జిల్లాకు కూడా చోటు దక్కింది.

ఐదేళ్ల ముందు తోటలకే వర్తింపు

ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకం అమలవుతున్న 15 జిల్లాల్లో బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వం వేర్వేరుగా నిర్ణయించింది. కాకినాడ జిల్లాలోని మామిడి రైతులు ఎకరాకు రూ.2వేల చొప్పున ప్రీమియం చెల్లించాలి. అలా ప్రీమియం చెల్లించిన రైతులకు రూ.40వేల నష్టపరిహారం లభించే అవకాశం ఉంది. ఈనెల 15లోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. 2020, అక్టోబరు 1 ముందు అనగా ఐదేళ్ల ముందు మామిడి తోటలు పెట్టిన వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.

దశాబ్దాల ఆకాంక్ష

మామిడి పంటకు బీమా సదుపాయం కల్పించాలని దశాబ్దాలుగా రైతులనుంచి డిమాండ్ ఉంది. వాతావరణంలో ఏర్పడే మార్పుల కారణంగా ఎక్కువ నష్టపోయేది మామిడి రైతులే.

బీమా ఎప్పుడు.. ఎలా వర్తిస్తుందంటే..

అకాల లేక అధిక వర్షం:	15.12.2024 నుంచి 28.02.2025
చీడపీడల వాతావరణం: (ముసురు, తేమ)	15.12.2024 నుంచి 28.02.2025
ఉష్ణోగ్రతలో వ్యత్యాసం:	01.01.2025 నుంచి 15.03.2025
అధిక గాలి వేగం:	01.03.2024 నుంచి 31.05.2025

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

ఒక్కో రైతు ఎన్ని ఎకరాలకు అయినా బీమా చేయించుకోవచ్చు. భూమి పట్టాదారు పాసు పుస్తకం జెరాక్స్, బ్యాంకు ఖాతా జెరాక్స్, ఆధార్ కార్డు జెరాక్స్, వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏల వద్ద పంట వేసినట్లు తీసుకున్న ధ్రువీకరణ పత్రం తీసుకుని దగ్గరలో ఉన్న బ్యాంక్ లేదా కామన్ సర్వీసు సెంటర్ లేదా పీఎంఎఫ్‌బీవై వెబ్‌సైట్‌లో నేరుగా రైతులే నమోదు చేసుకుని బీమా సదుపాయం పొందవచ్చు.

బీమా పథకంవల్ల వారి నష్టాలను కొంతవరకైనా పూడ్చుకునే అవకాశం ఉంటుంది. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా జిల్లాలోని రైతులకు ఎంతో ఉపయోగం కలుగుతుంది.

15 లోపు ప్రీమియం చెల్లించాలి

ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ పథకం కోసం రైతులు ఈనెల 15 లోపు ప్రీమియం చెల్లించాలి. ప్రీమియం చెల్లించినరోజు నుంచి బీమా వర్తిస్తుంది. పంటనష్టం కూడా 2024, డిసెంబరు 15 నుంచి 2025, మే 31 మధ్యకాలంలో అధిక వర్షపాతం, గాలిలో తేమశాతం, తేనెమంచు, వాతావరణ వ్యత్యాసం, అధిక గాలివేగం, చీడ పీడల ఉధృతి వంటి పరిణామాలను పరిగణించి పరిహారం లెక్కిస్తారు. మండలస్థాయి అధికారులు నష్టాన్నిలెక్కించి పరిహారాన్ని నిర్ణయిస్తారు.

-మల్లిఖార్జున్, ఉద్యానశాఖాధికారి, కాకినాడ

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- 70 గ్రాముల బంగారం అపహరణ
- రాయవరం మండలంలో ఘటన


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

రాయవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న వృద్ధురాలి ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు రాయవరం ఎస్ఐ బుజ్జిబాబు బుధవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లాలోని రాయవరం మండలం చెల్లూరులోని బొడ్డువారికూడలిలో బలుసు రమాదేవి అనే మహిళ నివసిస్తోంది. ఆమె భర్త మరణించగా కుమార్తె, కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నారు. దీంతో ఆమె ఒంటరిగా ఉంటోంది.ఆమె తన తల్లికి అనారోగ్యంగా ఉండడంతో ఈనెల 4న తల్లిని చూసేందుకు ఇంటికితాళం వేసుకుని వెళ్లింది. ఈనెల 9వతేదీ సాయంత్రం 6 గంటలకు వచ్చి చూసేసరికి ఇంటి తాళం తెరిచి ఉండడం.. ఇంట్లో దాన్యం అమ్మకాలు జరపగా వచ్చిన కొంత నగదుతో పాటు 30 గ్రాముల బంగారు గొలుసు, 40 గ్రాముల బంగారు గాజులు అపహరణకు గురైనట్లు గుర్తించింది. ఈ మేరకు బాధితురాలు రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. చోరీ జరిగిన ఇంటిని క్ల్యూస్ టీం పరిశీలించింది.

చెడు వ్యసనాలకు బానిసలై చోరీల బాట

- నాలుగు జిల్లాల్లో 29 బైక్‌లు చోరీ
- నలుగురి అరెస్టు.. వీరిలో ముగ్గురు బాలలే
- మరొక నిందితుడు పరారీ


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సెంట్రల్ జోన్ డీఎస్పీ కె.రమేష్‌బాబు

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): చెడువ్యాసనాలకు బానిసలైన యువకులు, బాలలు కలిసి 29 బైక్‌లు, స్కూటీలను చోరీ చేశారు. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లాలో చోటుచేసుకుంది. దొంగిలించిన బైక్‌లు మాత్రం నాలుగు జిల్లాల పరిధికి చెందివని కావడం గమనార్హం. ఈ మేరకు రాజమహేంద్రవరం త్రీటౌన్‌లో బుధవారం సెంట్రల్ జోన్ డీఎస్పీ కే.రమేష్‌బాబు వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా కాతేరు గామన్ బ్రిడ్జి రోడ్డులో ఈనెల 11న వాహనాల తనిఖీ చేస్తుండగా 16నుంచి 19 ఏళ్ల మధ్య వయసు గల నలుగురు యువకులు రెండు మోటార్ సైకిళ్లపై వెళ్తూ పోలీసులను చూసి వెనక్కి పారిపోతుండగా వెంటాడి పట్టుకున్నామన్నారు. వారిని విచారించగా రాజమహేంద్రవరం వీకర్స్ కాలనీకి చెందిన కుప్పం తేజ(19)తోపాటు మరొక ముగ్గురు బాలలను గుర్తించామన్నారు. వీరితోపాటు ఈ బైక్ దొంగతనాలకు పాల్పడిన రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరుకు చెందిన శ్రీరామ్ పరారీలో ఉన్నాడని చెప్పారు. ఈ ఐదుగురు కలిసి జల్సాలకు, చెడు వ్యసనాలకు బానిసలై బైక్‌లు స్కూటీలు దొంగిలించారని తెలిపారు. వీరు దొంగిలించిన బైక్‌లను కోరుకొండ మండలం దోసకాయలపల్లికి చెందిన వాడబోయిన రమేష్, గుర్రాల వెంకన్నలకు విక్రయించారని తెలిపారు. కొన్ని బైక్‌లను రాజమహేంద్రవరం క్వారీ గోతుల్లో దాచిపెట్టారని చెప్పారు. ఈ ఐదుగురు దొంగలు కలిసి త్రీటౌన్ పరిధిలో 12 బైక్‌లు, ప్రకాష్‌నగర్, రాజానగరం, కోరుకొండ, ధవళేశ్వరం, కడియం, అవిడి, నిడదవోలు, ప్రత్తిపాడు, ఏలూరు ప్రాంతాల్లో స్కూటీలను అపహరించారని తెలిపారు. ఈ దొంగ బైక్‌లు కొనుగోలు చేసుకున్న వారిపైన సెక్షన్ 4 (11)కింద కేసులు నమోదు చేశామన్నారు. దొంగిలించిన బైక్‌ల విలువ రూ.11.60 లక్షలు ఉంటుందన్నారు. నిందితుల్లో ముగ్గురు బాలలను జువైనల్ కోర్టుకు, మరొకరిని రిమాండ్‌కు పంపించామని, ఇంకొకరు పరారీలో ఉన్నారన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ వి.అప్పారావు, ఎస్ఐ అప్పలరాజు పాల్గొన్నారు.

వెయ్యి కిలోల గంజాయి పట్టివేత

- ఒడిశా నుంచి హరియాణాకు తరలిస్తుండగా కూనవరంలో స్వాధీనం
- ముగ్గురి అరెస్టు


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ కన్నపరాజు

కూనవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఒడిశానుంచి హరియాణాకు వెయ్యి కిలోల గంజాయితో వెళ్తున్న లారీని పోలీసులు ఛేదించి పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఎటపాక సీఐ కన్నపరాజు తెలిపిన వివరాలివి. పశ్చిమ బెంగాల్ నుంచి ఓ లారీ బియ్యం లోడుతో ఏపీలోని కాకినాడలో సరుకు దిగుమతి చేశారు. ఆ లారీ వైజాగ్ వెళ్లింది. అక్కడ ఐరన్‌ఓర్ లోడు చేసుకుని అక్కడినుంచి ఒడిశా వచ్చింది. ఒడిశాలో కలిమిలా దగ్గర ఎంపీ 81 అడవిలో అదే ప్రాంతానికి చెందిన సమాల్‌దేవ్ అనే వ్యక్తిని పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన కొందరు వ్యక్తులు కలిశారు. అక్కడ గంజాయి కొనుగోలు చేసి ఐరన్‌ఓర్ కింద లోడ్ చేసుకుని బయలుదేరారు. అక్కడి నుంచి ఏపీలోని చట్టీ రాగానే పోలీసులు ఏడురాళ్లపల్లి మీదుగా వెళ్లాల్సిన వాహనాలను కూనవరం వైపు మళ్లించారు. అప్పటికే పోలీసులు పక్కా సమాచారంతో కూనవరం మండలంలో జగ్గవరం క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో బుధవారం ఈ లారీ పట్టుబడింది. దీంతో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ శ్రీనివాస్‌తో పంచనామా నిర్వహించారు. 25కిలోలు ఉండే 40 బ్యాగుల్లో ఈ గంజాయిని స్మగ్లర్లు ఎగుమతి చేస్తున్నారు. వీటి విలువ రూ.50లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ఇద్దరు డ్రైవర్లు షేక్ షలిన్, షేక్ అక్తర్‌తోపాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన ఎంపీ 81 గ్రామానికి చెందిన సమాల్ దేవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. కూనవరం ఎస్ఐ లతశ్రీ, ఏఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

పులి జాడ కోసం అటవీ సిబ్బంది వెతుకులాట


బాపన్నదొర అటవీప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న ట్రాప్ కెమెరా

ప్రత్తిపాడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో సంచరిస్తున్న పులిజాడకోసం బుధవారం అటవీశాఖ సిబ్బంది విస్తృత గాలింపు చర్యలు కొనసాగించారు. నాలుగైదురోజులుగా ఈ అటవీప్రాంతంలో తిష్ఠ వేసిన పెద్దపులి కదలికలపై అటవీ సిబ్బంది సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో బుధవారం గాలింపు చర్యలు చేపట్టారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో కలియ తిరుగుతు న్న ఈ పెద్దపులిని ఇబ్బందికరమైన చర్యలు తీసుకోకూడదనే నిర్ణయానికి అటవీశాఖాధికారు లు వచ్చారు. బురదకోట 3,4 కిలోమీటర్ల పరిసరాల్లోనే పులి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. గత రెండురోజుల్లోను మండలంలోని రౌతుపాలెం తోటల్లో పులి సంచరించినట్లు ఆ రైతులు చెబుతున్నారు. రౌతుపాలెం, పాండవులపాలెం, కిత్తమూరుపేట, పొదురుపాక, తాడువాయి, దోపర్తి పరిసరాల్లో కూడా పులి సంచరించినట్లు సమాచారం. దీంతో ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ సిబ్బంది నియోజకవర్గంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో పులి కదలికల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. రిజర్వ్ ఫారెస్ట్‌ను ఆనుకుని ఉన్న గిరిజనులు పశువులను, అటవీప్రాంతంలోకి తరలించవద్దని, ఒంటరిగా అటవీప్రాంతంలోకి వెళ్లవద్దని హెచ్చరికలు చేస్తున్నారు. నియోజకవర్గంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో ఏలేశ్వరం రేంజర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఐదు బృందాలు బుధవారం గాలింపు చర్యలు చేపట్టినా పులి ఆచూకీ తెలియరాలేదు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అందజేత


సెల్‌ఫోన్‌లు అందజేస్తున్న రైల్వే పోలీసులు

తునిరూరల్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తుని రైల్వేపోలీస్‌స్టేషన్ పరిధిలో రైల్వే ప్రయాణికులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను బాధితుల్లో కొందరికి బుధవారం అందజేశారు. మొత్తం 34 సెల్‌ఫోన్‌లను సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి పట్టుకున్నారు. వాటి విలువ రూ.7,04,600 ఉంటుందని తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. సెల్‌ఫోన్‌లను సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించి రాజమహేంద్రవరం డీఎస్పీ రత్నరాజు ఆదేశాల మేరకు అందజేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువత సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

- నన్నయ వీసీ శ్రీనివాసరావు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సుధాకర్


సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థినులు

దివాన్‌చెరువు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): యువత సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు సూచించారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూ యువ కేంద్రం తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయి యువఉత్సవ్ కార్యక్రమం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. యువత సాంస్కృతిక కార్యక్రమాలపై దృష్టిసారిస్తే ఆరోగ్యం, ఆనందం కలుగుతాయన్నారు. యువ ఉత్సవ్ వంటి కార్యక్రమాలు నేటి యువతరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. నెహ్రూ యువజన కేంద్ర జిల్లా యువ అధికారి దూలం కిషోర్ మాట్లాడుతూ సైన్స్ మేళా ఎగ్జిబిషన్ గ్రూప్ పెయింటింగ్, పద్యాలు, రాయడం, ఫొటోగ్రఫీ, వక్తృత్వం, సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు నిర్వహించామన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ఎగ్జిబిషన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.



వివాహిత దేవి మృతదేహం.. దేవి(ఫైల్)

వివాహిత ఆత్మహత్య

కొవ్వూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పెళ్లైన ఏడాదికే వివాహిత ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన కొవ్వూరులో చోటుచేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని 1వ వార్డు శ్రీరామకాలనీకి చెందిన నేతల దేవి (21) స్వస్థలం కాకినాడజిల్లా తొండంగి మండలం చిన్నాయిపాలెం. బుధవారం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఆమె సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అంతకుముందు భర్త వీరబాబుకు ఫోన్ చేసి చికెన్ తెమ్మని చెప్పింది. అతడు చికెన్ పట్టుకుని వచ్చి వీరబాబుకు భార్య ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. కిందకు దింపే సరికి మృతి చెందిందని, ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో గత నెలలో 20రోజులు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించామని వీరబాబు తెలిపాడు. వీరికి వివాహం జరిగి ఏడాది కావస్తోంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇప్పటివరకు బాధితులనుంచి ఫిర్యాదు అందకపోవడంతో కేసు నమోదు చేయలేదని పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు.

హెరిటేజ్ పాల రైతులకు రూ.125కోట్ల రుణాలు

- సంస్థ ప్రెసిడెంట్ సాంబశివరావు



కోటనందూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) హెరిటేజ్ పాల ఉత్పత్తి కేంద్రం ద్వారా దేశంలోని 12రాష్ట్రాల్లో రైతులకు రూ.125కోట్లు రుణాలు అందించామని సంస్థ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.సాంబశివరావు అన్నారు. బుధవారం కాకినాడ జిల్లాలోని కోటనందూరు హెరిటేజ్ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది ఇంతవరకు 10వేల మందికి రుణాలిచ్చామన్నారు. దేశంలో ని 12 రాష్ట్రాల్లో రోజుకు 19 లక్షల లీటర్ల పాలసేకరణ చేస్తున్నామని, ఈ పాలను 15లక్షల కుటుంబాలకు అమ్మకాలు చేస్తున్నామని తెలిపారు. రాబోయేరోజుల్లో ప్రతిఏటా 3లక్షలలీటర్ల పాల ఉత్పత్తిని పెంచేందుకు కృషిచేస్తున్నామన్నారు. 3లక్షలమంది రైతులకు గ్రూప్ ఇన్సూరెన్స్ ఏర్పాటుతోపాటు పాలరైతులకు తక్కువ ధరకే పశుదాణా అందిస్తున్నామని తెలిపారు. దేశంలో 9500 పాలసేకరణ కేంద్రాల ద్వారా 19 ప్రాసెసింగ్ యూనిట్‌లకు పాలసేకరణ చేస్తున్నామని తెలిపారు. ఆ సమావేశంలో హెరిటేజ్ హెడ్ ప్రొక్యూర్‌మెంట్ ఇన్‌పుట్స్ ఎస్.రామ్మోహన్‌రావు, వైస్ ప్రెసిడెంట్ వి.దివాకర్ ఉన్నారు.

అనారోగ్యంతో సెంట్రల్ జైలు ఖైదీ మృతి

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఒడిశాకు చెందిన దాశరథి మహాపాత్ర (40) అనార్యోగంలో మరణించాడు. వన్‌టౌన్ పోలీసులు కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన మహాపాత్ర ఈ ఏడాది సెప్టెంబరులో మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో గంజాయి రవాణా చేస్తూ పోలీసులు పట్టుబడ్డాడు.అతనికి న్యాయస్థానం రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌ఖైదీగా ఉన్నాడు. కొద్దిరోజులుగా మూర్ఛ, శ్వాససంబంధిత వ్యాధులతో బాధపడుతున్నాడు. మంగళవారం అతడికి వాంతి కావడంతో జైలు ఆస్పత్రిలో చికిత్స అందించారు. రాత్రికి పరిస్థితి విషమించడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి జైలు సిబ్బంది తరలించారు. చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. జైలు అధికారుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

పి.గన్నవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలంలో ప్రధాన పంట కాల్వలోకి కారు దూసుకుపోయిన ఘటనలో గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యమైంది. దీనికి సంబంధించి ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం చింతావారిపేట వద్ద మంగళవారం తెల్లావారుజామున ప్రమాదవశాత్తూ పంటకాల్వలోకి కారు దూసుకుపోయిన ఘటనలో పోతవరం గ్రామానికి చెందిన విజయ్‌కుమార్‌తోపాటు భార్య ఉమ, కుమారులు రోహిత్, మనోజ్ ప్రయాణిస్తున్నారు. ఈప్రమాదంలో విజయ్‌కుమార్ బయటపడగా భార్య ఉమ(32), కుమారులు రోహిత్(9) మృతిచెందారు.మరో కుమారుడు మనోజ్(5) గల్లంతు కాగా.. అతడి మృతదేహం సంఘటనాస్థలికి కూతవేటుదూరంలో బుధవారం లభ్యమైంది. విజయ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ బి.శివకృష్ణ కేసు నమోదు చేయగా సీఐ భీమరాజు దర్యాప్తు చేపట్టారు.

టవర్ ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదు

● గ్రామస్తుల తిరుగుబాటు

ఉప్పలగుప్తం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): చినగాడవిల్లిలో సెల్‌టవర్ ఏర్పాటుకు గ్రామస్తులు అంగీకరించలేదు. టవర్ ఏర్పాటును ఎట్టి పరిస్థితిలోను అనుమతించేది లేదని తెగేసి చెప్పారు. అయినప్పటికీ నిర్వాహకులు వినకపోవడంతో గ్రామస్తులు తహసీల్దార్‌కు విన్నవించుకున్నారు. తహసీల్దార్ వాసా దివాకర్ బుధవారం టవర్ ఏర్పాటు ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. స్థల యజమాని అంగీకారం మేరకు కంపెనీ తరపున నిర్మాణపనులు ప్రారంభించినట్టు కాంట్రాక్టరు తెలిపారు. టవర్ ఏర్పాటు చేస్తే తాము అనారోగ్యం పాలవుతామని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో టవర్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ పంచాయతీకి వినతిపత్రం సమర్పించామన్నారు. టవర్ ఏర్పాటు చేయకుండా పంచాయతీ చర్యలు తీసుకుందన్నారు. బుధవారం టవర్ నిర్మాణ పనులు ప్రారంభించారని, పంచాయతీ ఆదేశాలు పట్టించుకోమంటూ సమాధానమిచ్చారని మహిళలు తమగోడు వినిపించారు. టవర్ నిర్మాణ పనులను అడ్డుకోవాలని తహసీల్దార్‌ను అభ్యర్థించారు. తక్షణం పనులు నిలిపివేయాలని తహసీల్దార్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పూర్తి ధ్రువీకరణ, అనుమతి పత్రాలను పరిశీలించాలని వీఆర్వోకు సూచించారు. పినిశెట్టి వెంకటరెడ్డినాయుడు ఆధ్వర్యంలో జరిగింది.


చినగాడవిల్లిలో సెల్ టవర్ ఏర్పాటును అడ్డుకుంటున్న గ్రామస్తులు

వేద పారాయణం

మామిడికుదురు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆదుర్రులో ఉన్న శ్రీసర్వమంగళ పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో వేద పారాయణ కార్యక్రమం మంత్రోచ్ఛరణ మధ్య బుధవారం ఘనంగా ప్రారంభమైంది. లోక కల్యాణార్థం ఏడురోజులపాటు వేదపండితులు వేద పారాయణాన్ని నిర్వహిస్తారని నిర్వాహకులు ఉపాధ్యాయులు వెంకటలక్ష్మీ, సుబ్రహ్మణ్యం ఘనాపాఠి తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రదక్షిణలు గురువందనం, గణపతి పూజ, నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు జి.పల్లిపాలెం విద్యార్థుల ఎంపిక

మలికిపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కౌశల్ సైన్స్ ప్రతిభ రాష్ట్రస్థాయి పోటీలకు గూడపల్లి పల్లిపాలెం జిల్లాపరిషత్ హైస్కూలుకు చెందిన పెచ్చెట్టి శ్రీరమ్య (9వ తరగతి), పెచ్చెట్టి లక్ష్మీశ్రీ (9వ తరగతి) కౌశల్ క్విజ్, పోస్టర్ విభాగాల్లో కోనసీమ జిల్లాస్థాయి నుంచి ఎంపికైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్కే సలీంబాషా తెలిపినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆచంట రామచంద్రరావు తెలిపారు.

అధికారుల అలసత్వం వల్లే యువకుడిపై ఆక్వా రైతుల దాడి

అమలాపురం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లిలో అక్రమ ఆక్వా సేద్యాన్ని అరికట్టాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయడంలో అధికారులు అలసత్వం వహించారని మానవ హక్కుల వేదిక ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి నామాడి శ్రీధర్, జిల్లాశాఖ అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. అధికారులు అలసత్వం వల్లే యువకుడైన చిక్కం వీరదుర్గాప్రసాద్‌ను కట్టి భౌతిక దాడికి పాల్పడ్డారన్నారు. దాడిచేసిన ఆక్వా రైతులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, అక్రమ ఆక్వా సాగుపై హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీరదుర్గాప్రసాద్‌పై దాడి ఘటనకు సంబంధించి బుధవారం మానవ హక్కులవేదిక ప్రతినిధుల బృందం నిజ నిర్ధారణ జరిపింది. సన్నవిల్లిలో అక్రమ ఆక్వా చెరువుల కాలుష్యానికి వ్యతిరేకంగా గ్రామస్తులు పదేళ్ల నుంచి పోరాటం చేస్తున్నారన్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారన్నారు. దాడికి పాల్పడ్డ ఆక్వారైతులు గనిశెట్టి సత్యనారాయణ, గనిశెట్టి వెంకట్రాజు, గనిశెట్టి శ్రీనివాసరావు, చిక్కం గాంధీలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యవర్గ సభ్యుడు పి.పవన్‌తోపాటు హెచ్‌ఆర్‌ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆక్వా మాఫియాపై కఠినచర్యలు తీసుకోవాలని బహుజన సమాజ్ పార్టీ, పీడీఎస్‌యూ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దుర్గాప్రసాద్‌ను బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు పరామర్శించారు.

స్వామివారి కల్యాణోత్సవాలకు టెండర్లు ఖరారు


టెండర్లు పరిశీలిస్తున్న అధికారులు

అంతర్వేది, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మాఘమాసంలో ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే స్వామివారి కల్యాణ మహోత్సవాలకు సంబంధించిన టెండర్లను బుధవారం ఆలయంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ఖరారు చేసినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. గతంలో వాయిదా పడిన లడ్డూ ప్రసాదం తయారు చేయుటకు లేబర్ కాంట్రాక్టు, విద్యుత్ అలంకరణ, షామియానా, వంట పాత్రల సప్లయి చేయుట, సర్వేబాదుల సప్లయి, ఫొటోలు, వీడియోలకు సంబంధించిన టెండర్లను ఖరారు చేశారు. ఎంపీటీసీ బైరా నాగరాజు, ఆలయ అధికారులు టెండర్‌దారులు పాల్గొన్నారు.

అల్పపీడనంతో అన్నదాతల ఆందోళన

● ముమ్మరంగా మాసూళ్ళు.. మిల్లులకు తరలింపు
● మరో పక్క రబీకి సిద్ధమవుతున్న రైతులు


ముక్కామలలో ధాన్యం పట్టుబడి పడుతున్న రైతులు


మామిడికుదురులో ధాన్యంపై బరకం కప్పిన దృశ్యం

అంబాజీపేట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆరుమాసాలు శ్రమించి పండించిన పంటను దక్కించుకోవాలన్న ఆశతో వాతావరణ మార్పుల కారణంగా అన్నదాతలు బిజీబీజీ వరికోతలు, మాసూళ్లచేసి ధాన్యాన్ని మిల్లర్లకు అమ్మే పనిలో నిమగ్నమయ్యారు. వాతావరణంలో మార్పులు చోటుచేటుచేసుకోవడంతో రైతుల్లో మళ్లీ అలజడి మొదలైంది. ఇప్పటికే ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కోతలు ఆలస్యమవ్వడంతో మరో అల్పపీడనం ఉందని సోషల్‌మీడియాలో హల్‌చల్ చేయడంతో రైతులు ఉరుకులు, పరుగులపై ధాన్యాన్ని యంత్రాలతో కోసి ఒడ్డుకు చేరుస్తున్నారు. అనంతరం రహదారులపై ఆరబోసి పట్టుబడి పడుతున్నారు. ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు హడావిడిగా మాసూళ్ల చేస్తున్నారు. వేలల్లో పెట్టుబడి పెట్టి పైర్లను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. పంట చేతికి వచ్చే సమయలో వరుణదేవుడు కన్నెర్రకు రైతులు తీవ్ర ఆందోళనకు గురువుతున్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇపట్పికే 70శాతానికి పైగా వరి కోతలు కోసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మరో నాలుగు రోజుల్లో మరో అల్పపీడనం ఉందని హెచ్చరికలు జారీచేస్తున్న నేపథ్యంలో రైతులు యంత్రాల కోసం వెతుకుతున్నారు. వరికోతల యంత్రాలకు భారీ గిరాకీ పెరిగింది. యంత్రాలను ఈ ప్రాంతానికి తీసుకువచ్చిన వ్యాపారులు అధికంగా వచ్చే రైతులకు ముందుగా వరికోత యంత్రాలను పంపిస్తున్నారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూలీలతో వరికోతలు కొయ్యలేని పరిస్థితుల్లో రైతులు ఉండటంతో వరికోత యంత్రాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి తప్పడంలేదు. వరికోతలు పూర్తయిన రైతులు రబీకి సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు.

మారిన వాతావరణం

మామిడికుదురు: బుధవారం వాతావరణం మారి ఒక మోస్తరు వర్షం కురవడంతో రైతులు తమ పంటను రక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. ధాన్యం రాశులపై బరకాలు కప్పుకునే పనిలో పడ్డారు. కోసిన వరి పనలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకుని చేతికంది వచ్చిన పంటను రక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలో 2560 ఎకరాల్లో సార్వా సాగును రైతులు చేశారని, 1100 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని, ఇప్పటివరకు 2200 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు ఎగుమతి చేసినట్టు మండల వ్యవసాయాధికారి బి.మృదుల తెలిపారు. మారిన వాతావరణం దృష్ట్యా ఈదురుగాలులు సంభవిస్తే వరి పంట నేలనంటి అపార నష్టం వాటిల్లే ఆస్కారం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కూలీల రేట్లు పెరిగి పెట్టుబడి రెట్టింపు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో వాయుగుండాలు తమ పాలిట శనిగండాలుగా మారాయని రైతులు దిగాలు చెందుతున్నారు.

గుర్తింపు కార్డు చూపించి ఓటెయ్యాలి

కాట్రేనికోన, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 14న నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని తహసీల్దార్ సునీల్‌కుమార్ తెలిపారు. రైతులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లినప్పుడు పట్టాదారు పాసుపుస్తకం లేదా వీఆర్వో జారీ చేసిన అనుమతి పత్రం లేదా ఆధార్ కార్డు లేదా పాన్ కార్డు తీసుకువెళ్లాలన్నారు. ఓటరు జాబితాలో తమ పేరు సరిచూసుకుని ఓటెయ్యాలన్నారు.

టోపీ గ్యాంగ్ ఆగడాలను అరికట్టాలని కరపత్రాలు

మామిడికుదురు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరం గ్రామంలో నాయకులమని చెప్పుకుంటూ ప్రజలను మోసంచేస్తున్న టోపీ గ్యాంగ్ ఆగడాలను అరికట్టాలంటూ కరపత్రాలు ముద్రించి వాటి ద్వారా ప్రచారం చేశారు. ఈ టోపీ గ్యాంగ్ సభ్యులు తమకు ఎంపీ, ఎమ్మెల్యేలతో సత్సంబంధాలు పుష్కలంగా ఉన్నాయని, ఓఎన్జీసీ ఉద్యోగాలు, ఉద్యోగుల బదిలీలు, కాంట్రాక్టు పనులు తదితర పనులు చేయిస్తామని ప్రజల్ని మోసగిస్తున్నారని కరపత్రంలో పేర్కొన్నారు. చక్కటి చిరునవ్వుతో అతి వినయంగా నటిస్తున్న వ్యక్తి ఈ గ్యాంగ్ లీడరు అని, ఇతను గతంలో ఓఎన్జీసీ బాధితుల నుంచి లక్షల్లో లబ్ధి పొందాడని ఈ ప్రాంతవాసులకు తెలుసునని కరపత్రంలో పేర్కొన్నారు. ఈ గ్యాంగ్‌లోని సభ్యులు ఉద్యోగాలు వేయిస్తామని పలువురిని మోసం చేస్తున్నారని, ఈ గ్యాంగ్‌కు అమలాపురానికి చెందిన ఒక విలేఖరి అండదండలు ఉన్నాయని ఈ గ్యాంగ్ సహకారంతో అతను బాగా సంపాదించి ఆస్తులు కూడబెట్టాడని పేర్కొంటూ ముద్రించిన కరపత్రం గ్రామంలో సంచలనంగా మారింది. ఈ గ్యాంగ్ ఆగడాలను తెలియజేస్తూ ఈ ప్రాంత వాసులు పారాహుషార్‌గా ఉండాలని సూచిస్తూ ఈ కరపత్రాలను ముద్రించి పరిసర గ్రామాల్లో కూడా ఈ గ్యాంగ్ ఆగడాలను గుర్తు తెలియని వ్యక్తులు కరపత్రంగా ముద్రించి ప్రచారం చేస్తున్నారు.

కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘ గౌరవ సలహాదారుడిగా కేవీ రాజు


కొపనాతి వెంకట్రాజు

అల్లవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘం జిల్లా గౌరవ సలహాదారుడిగా సామంతకుర్రుకు చెందిన కొపనాతి వెంకట్రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోనసీమజిల్లా అగ్నికుల క్షత్రియ అధ్యక్షుడు తారాడి శివ, గౌరవాధ్యక్షుడు కర్రి స్వామినాథన్ కేవీ రాజును జిల్లా కార్యవర్గంలో నియమించారు. అగ్నికుల క్షత్రియ సంఘం బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని వెంకట్రాజు (కేవీరాజు) చెప్పారు. ఆయన నియామకంపట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

యెంట్రుకోన ఉప సర్పంచ్ రాజీనామా


రాజీనామాలేఖను ఎంపీడీవోకు అందిస్తున్న శ్రీలత

అల్లవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలం యెంట్రుకోన పంచాయతీ ఉపసర్పంచ్ కన్నెపాముల శ్రీలత బుధవారం పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామాలేఖను ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్‌కు అందచేశారు. తాను వ్యక్తిగత కారణాలవల్లే పదవికి రాజీనామా చేస్తున్నట్లు శ్రీలత తెలిపారు.

పాత్రికేయులపై దాడి హేయమైన చర్య

అంబాజీపేట, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు మంచు కుటుంబంలో ఏర్పడ్డ కుటుంబ వివాదాలను చిత్రీకరించేందుకు వెళ్లిన పాత్రికేయులపై నటుడు మోహన్‌బాబు దాడిచేయడం హేయమైన చర్య అని దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని అంబాజీపేట జర్నలిస్టు అసోషియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. అంబాజీపేట తహశీల్దారు జె.వెంకటేశ్వరి, ఎస్ఐ కె.చిరంజీవిలకు వినతిపత్రాలను అందించారు.

కంద దీపం నుంచి శక్తివంతమైన దివ్యకాంతులు


అమలాపురం ఆదిశేషా నిలయంలో అఖండంగా వెలుగుతున్న కంద దీపం

అమలాపురంటౌన్, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): అమలాపురం విద్యుత్‌నగర్‌లోని శ్రీ గౌతమ మహర్షి అక్షయపాత్ర కేంద్రమైన శ్రీఆదిశేషా నిలయంలో వారాహి రూపంలో అతిపెద్ద కందతో ఈ ఏడాది అక్టోబరు 30న కంద దీపం వెలిగించారు. ఈనెల 23వ తేదీ కాల భైరవాష్టమి వరకు కంద దీపం అఖండంగా వెలుగుతూ ఉంటుందని అక్షయ పాత్ర ప్రతినిధి పోతురాజు కనకదుర్గ, సలాది సాయిరామ్ తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు బారులు తీరి బుధవారం కంద దీపాన్ని దర్శించుకున్నారు.

‘రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి’

రెండోరోజు రెవెన్యూ సదస్సుల్లో 286 అర్జీలు

అమలాపురం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రెండో రోజు బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి 286 అర్జీలను స్వీకరించినట్టు కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. తొలి రోజు 406 దరఖాస్తులు అందగా రెండు రోజులకు 692 దరఖాస్తులు అందాయన్నారు. వీటిలో 44 అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించినట్టు తెలిపారు. ఎ.వేమవరం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ జీడీ కిశోర్‌బాబు, డిప్యూటీ తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ పాల్గొన్నారు. 15 అర్జీలను స్వీకరించగా 6 అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు.

రాజోలు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని రాజోలు తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. కాట్రేనిపాడులో బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సుకు డీఎల్పీవో బొజ్జిరాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించి 19మంది, రేషన్‌కార్డుల కోసం 20మంది, గృహనిర్మాణం కోసం పది మంది, పెన్షన్ల కోసం 30 మంది, ఐఎస్ఎల్ కోసం రెండు దరఖాస్తులు మొత్తం 81 దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ రాజు, దేవదాయశాఖ ఈవో రాజు, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మామిడికుదురు : గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం నిర్వహిస్తుందని తహశీల్దార్ ఆచార్యులు తెలిపారు. నగరం పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు బుధవారం జరిగింది. కార్యక్రమంలో పలువురు రైతులు తమ అర్జీలను సమర్పించారు. ఆయా ఆర్జీలను త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తామని మండల ప్రత్యేకాధికారి ఎస్వీపీ రామ్మోహనరావు, తహశీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జాలెం రమణకుమారి, ఆర్ఐ రహీం, వీఆర్వోలు కె.శ్రీనివాస్, వెంకటేశ్వరరావులు, స్థానిక నాయకులు జాలెం సుబ్బారావు, కోళ్ల సురేష్ పాల్గొన్నారు.

పి.గన్నవరం: రెవెన్యూ సదస్సులను ప్రతి రైతు వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తహశీల్దార్ పి.శ్రీపల్లవి కోరారు. మానేపల్లిలో ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం రైతుల నుంచి స్వీకరించిన 30 అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామని తహశీల్దార్ సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ వర్మ, వీఆర్వో వి.సత్య నారాయణ, ఉపసర్పంచ్ ఉండ్రాజవరపు బేబి, పితాని నరసింహరావు, రైతులు పాల్గొన్నారు.

అంబాజీపేట: ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో రైతుల భూసమస్యలను పరిష్కరిస్తామని తహశీల్దారు జె.వెంకటేశ్వరి సూచించారు. పుల్లేటికుర్రు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన రెవెన్యూ సదస్సును నిర్వహించారు. అనంతరం పలువురి నుంచి అర్జీలనుస్వీకరించారు. ఎంపీటీసీలు పబ్బినీడి రాంబాబు,కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలం వీవీ మెరక-1, 2లో రెవెన్యూ సదస్సులు తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకు ఈ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతీఒక్కరూ రెవెన్యూ సదస్సుకు హాజరై తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహశీల్దార్ కోరారు.

మాలల మహాగర్జనను విజయవంతం చేయాలి


త్రీరోడ్ సెంటర్‌లో కర పత్రాలను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు జేపీసీ నాయకులు

పి.గన్నవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి):ఈనెల 15న గుంటూరు నల్లపాడులో జరిగే మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని పి.గన్నవరం మండల మాలమహానాడు జేఏసీ పిలుపునిచ్చింది. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రాణాలైనా అర్పించి ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటామన్నారు. రాజకీయపార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల కు మాలలను వాడుకుంటూ నిత్యం మాలలను అణగదొక్కుతున్నారని వారు మండిపడ్డారు. భావితరాల భవిష్యత్‌కోసంమాలల మహాగర్జనకు మన మందరం కదిలి వెళ్లాలని వారు పిలుపు నిచ్చారు. అనంతరం మాలల మహాగర్జన కరప త్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నక్కా వెంకటేశ్వరరావు, యన్నపు పెద్ద, సాధనాల రమేష్, కొక్కిరి రవికుమార్, కోటవిజయభాస్కర్, పుచ్చకాయల సత్యనారాయణ, నబ్బితి చినబాబు, గోగి రాంబాబు, కొల్లె సూర్యనారాయణ, గణపతి, కె.ఆనందబాబు, నాగరాజు, సాధు పాల్గొన్నారు.

విశ్వకర్మయోజన శిక్షణ తరగతులు ప్రారంభించాలి


జేసీ నిషాంతికి వినతిపత్రం అందజేస్తున్న చేతివృత్తుల సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి విశ్వకర్మయోజన పథకం కింద 18 రకాల చేతి వృత్తిదారులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు దుర్గామల్లేశ్వరస్వామి కార్పెంటర్ చేతి వృత్తుల సంక్షేమ సేవాసంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి గుర్తింపు కార్డులు అందాయని, అయినప్పటికీ ఇంతవరకు జిల్లాలో శిక్షణా తరగతులు ప్రారంభించలేదని వెంటనే శిక్షణ ఇచ్చేలా చూడాలని కోరుతూ బుధవారం జాయింట్ కలెక్టర్ టి.నిషాంతికి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ప్రాంతాల వారీగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గున్నేపల్లి భీమశంకరం, కొనుకు వెంకటేశ్వరరావు, సాధనాల రామకృష్ణ, పితాని బేబిరావు, కుసుమే నరసింహరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యోగా గురువు భైరవస్వామికి సత్కారం


భైరవస్వామిని సన్మానిస్తున్న సాంబశివరావు

అమలాపురం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకుని అమలాపురం ఎర్రమిల్లివారి వీధిలోని ఎస్ఎస్ఆర్ ఎల్పీఎల్ ట్రైనింగ్ ప్రైవేటు లిమిటెడ్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ తరుపున ఏటా ఇచ్చే ఎన్‌లైటింగ్ ఎడ్యుకేటర్ అవార్డును జాతీయ యోగా న్యాయ నిర్ణేత మోటూరి భైరవస్వామికి అందజేసి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చిక్కం సాంబశివరావు ఆధ్వర్యంలో సత్కరించారు. విద్య ద్వారా సమాజాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న బోధకులను గుర్తించి వారి స్వగ్రామాల్లో ఈ అవార్డులు అందజేయనున్నట్టు ప్రకటించారు. వచ్చే ఏడాది డిసెంబరు 1 వరకు ఔత్సాహికులు దరఖాస్తులు చేసుకుంటే వచ్చే ఏడాది నుంచి ఈ విధానం అమలు చేస్తామని శివానిక్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నూతనంగా ఎన్నికైన సాంబశివరావు ప్రకటించారు. మేనేజింగ్ డైరెక్టర్‌గా చిక్కం శాంతిస్వరూప్ కొనసాగుతారని ప్రకటించారు.

సమ్మె డిమాండ్లు పరిష్కరించాలి


ఎమ్మెల్యే ఆనందరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఇంజనీరింగ్ సిబ్బంది

అమలాపురం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అమలాపురం పురపాలక సంఘ ఇంజనీరింగ్ ఇండోర్, అవుట్‌డోర్ సిబ్బంది చేపట్టిన సమ్మె బుధవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.29,200, రూ.24,500 వేతనాలు ఇవ్వాలని, 15 ఏళ్లు పైబడిన కార్మికులను రెగ్యులర్ చేయాలని, సీనియారిటీ ప్రాతిపదికన జీతాలు చెల్లించి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణికు అర్జీలు అందజేశారు.

ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమణమూర్తి


ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

అమలాపురం రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి నగర్‌లో బుధవారం ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం కొప్పిశెట్టి వనమయ్య అధ్యక్షతన జరిగింది. స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గాలిదేవర వెంకటరమణ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా మట్టపర్తి సత్తిబాబు, ఉపాధ్యక్షులుగా దొమ్మేటి స్వామి, కొప్పుల గంగాధర్, కోశాధికారిగా అనప్పిండి కామేష్, డి.సురేష్, సహాయ కార్యదర్శులుగా కె.నాగవెంకట దుర్గారావు, పి.సత్తిరాజు, డి.కిరణ్, కార్యవర్గ సభ్యులుగా పి.శ్రీనివాస్, ఎస్.నాగేశ్వరరావు, కె.భోగి రాజు తదితరులను ఎన్నుకున్నారు.

రహదారిని ఆధునికీకరించాలని నిరసన

మామిడికుదురు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పాశర్లపూడిలో గోతులుపడి అధ్వానంగా తయారైన రహదారిని ఆధునికీకరించాలంటూ కాంగ్రెస్ నాయకులు బుధవారం నిరసన తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో నాయకులు పాల్గొని రోడ్డును ఆధునికీకరించాలంటూ నినాదాలు చేశారు. రోడ్డు కిలోమీటరు మేర పెద్దపెద్ద గోతులు పడి అనేక ప్రమాదాలు సంభవిస్తున్నా సంబంధిత అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని చిట్టిబాబు ఆరోపించారు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే గుండె చేతపట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొత్తూరి శ్రీనివాస్, మహ్మద్ ఆరీఫ్, అప్పన శ్రీరామకృష్ణ, అయితాబత్తుల సుభాషిణి, మాచవరపు శివన్నారాయణ, నీతిపూడి బాలసత్యనారాయణ, చిట్టాల రామజోగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నామినేటెడ్ పోస్టుల భర్తీలో జనసేనకు ప్రాతినిథ్యం కల్పించాలి

అల్లవరం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే నీటి సంఘాలు, సహకార సంఘాల ఎన్నికలలో దేవస్థానం చైర్మన్ల నామినేటెడ్ పోస్టుల భర్తీలో జనసేనకు ప్రాతినిథ్యం కల్పించాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును కోరుతూ తీర్మానించారు. అల్లవరంలో మండల నాయకుడు కంకిపాటి వీరబాబు అధ్యక్షతన మండల జనసేన పార్టీ సమావేశం జరిగింది. గత ఎన్నికల్లో కూటమి విజయంలో జనసేన కృషిని గుర్తించాలని తీర్మానించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నేతృత్వంలో పార్టీ బలోపేతం అవుతుందని అందుకు తగ్గినట్లుగా నాయకులు కృషి చేయాలన్నారు. గుర్రం కృష్ణ, కటికిరెడ్డి బాబి, తిక్కిరెడ్డి శ్రీనివాస్, పిండి గణపయ్య, మేడిద శంకరరావు, నల్లా రాము, చిట్నీడి శ్రీనివాసరావు, తిక్కా శేషుబాబు, పొలమూరి బాబూరావు, కఠారి సుబ్బారావు, కంకిపాటి సుబ్బారావు, వర్రే సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫెంగల్ తుఫాన్‌కు పుదుచ్చేరి ప్రభుత్వ సాయం

యానాం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):పుదుచ్చేరిలో ఫెంగల్ తుఫాన్ నేపథ్యంలో యానాంలో కురిసిన వర్షాలకు ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు పరిహారం ఇవ్వా లని పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామిని కోరిన మేరకు యానాంలో ప్రతి రేషన్‌కార్డుకు రూ.5వేలు సాయం ప్రకటిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. ఈమేరకు పుదుచ్చేరి నుంచి యానాం వచ్చిన మల్లాడి బుధవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. ఇటీవల పుదుచ్చేరి వెళ్లి సీఎం రంగసామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలెక్టర్ ఇతర అధికారులకు వినతిపత్రం అందజేశారు. దీంతో తన వినతిపత్రం తీసుకున్న సీఎం పుదుచ్చేరి, కారైకాల్‌తోపాటు యానాంలోని ప్రతిరేషన్‌కార్డుకు రూ.5వేలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో యానాంలో ఉన్న ఎరుపురంగు కార్డులు 10895, పసుపు రంగుకార్డులు 4965లకు రూ.5వేలు అతి త్వరలో వారి వ్యక్తిగత ఖాతాలలో జమకానున్నాయి. అదేవిధంగా పంటనష్టానికి ఇటీవల వ్యవసాయశాఖ ఇచ్చిన నివేదికతోపాటు తానుకుడా పరిహారం ఇవ్వాలని కోరానని ఆయన తెలిపారు. అదికూడా త్వరలోనే ప్రభుత్వం ఇవ్వనుందన్నారు. అడిగిన వెంటనే స్పందించిన పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి, గవర్నర్ కైలాష్‌నాథ్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, కలెక్టర్ ఇతర అధికారులకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా యానాంకు వరద సహాయం అందించిన ముఖ్యమంత్రి, గవర్నర్‌లకు స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కృతజ్ఞతలు తెలిపారు.

కనకముత్యాలమ్మకు నైవేద్యాలు

అంతర్వేది, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం కేశదాసుపాలెం-అంతర్వేది గ్రామాల్లో ఉన్న శ్రీకనకముత్యాలమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం గ్రామోత్సవం జరిగింది. గురువారం అమ్మవారికి తీర్థం జరుగుతుంది.

క్రిస్మస్ ఆరాధన

మలికిపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు అందరూ అనుసరించి తోటివారికి సహాయం చేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. బుధవారం మలికిపురం జీపీఆర్ ఆవరణలో జరిగిన పాస్టర్ ఫెలోషిప్ క్రిస్మస్ ఆరాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను దుశ్శాలువాతో సన్మానించారు.





విజయదుర్గ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఘనంగా విజయదుర్గ అమ్మవారి తీర్థం

ఆలమూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బడుగువానిలంక లంక భూముల మధ్యలో వేంచేసియున్న శ్రీవిజయదుర్గ అమ్మవారి తీర్థ మహోత్సవానికి బుధవారం భక్తులు పోటెత్తారు. బడుగువానిలంకలో సాగు చేస్తున్న ఆలమూరు, ఆత్రేయపురం, రావులపాలెం, కడియం మండలాలకు చెందిన రైతులు కుటుంబసమేతంగా విచ్చేసి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కొత్తపేట నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



ర్యాంపులో వేతనం సరిపోవట్లేదని ఆర్డీవో శ్రీకర్‌కు చెప్తున్న కూలీలు

ఆత్రేయపురం ఇసుక రీచ్ ఆకస్మిక తనిఖీ

ఆత్రేయపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం ఇసుక రీచ్‌ను కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఇసుక నిల్వలు, రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీచ్‌లో తమకు ఉపాధి కల్పించాలని కూలీలు ఆర్డీవోను కోరగా పనులు కల్పించాలని సంబంధిత కాంట్రాక్టరుకు సూచించారు. ర్యాంపులో స్కానర్ పనిచేయకపోవడంతో లోడింగ్ కోసం గంటల తరబడి వేచియుండాల్సి వస్తోందని లారీ డ్రైవర్లు ఆర్డీవోకు వివరించారు. దీనిపై ఆయన సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఆర్డీవో వెంట తహసీల్దారు రాజేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



ఆంజనేయ స్వామి ఆలయంలో సమావేశమైన భక్తులు

'ఆలయాన్ని దేవదాయ శాఖలో కలపద్దు'

రామచంద్రపురం (ద్రాక్షారామ), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణ పరిధిలోని ముచ్చుమిల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉప ఆలయంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయాన్ని దేవదాయ శాఖలో కలపవద్దని, అర్చకుడిని కొనసాగించాలని కొందరు తీర్మానించారు. మంగళవారం రాత్రి జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ అర్చకుడిపై కొంత మంది చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఖండించారు. 13 ఏళ్లుగా ఆలయానికి ఆదాయం లేకపోయినా అర్చకుడు భక్తుల సహకారంతో విద్యుత్ బిల్లు చెల్లించడం, ధూప, దీప నైవేద్యాలు పెడుతూ కల్యాణం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అటువంటి అర్చకుడిని తొలగించమనడం సరికాదని ఆలయాన్ని గ్రామస్తులే నిర్వహించుకోవాలని నిర్ణయించారు. ముచ్చుమిల్లి, మద్యనగర్, కవలవారిసావరం ప్రజలు పాల్గొన్నారు.



విద్యార్థినులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సత్యానందరావు

జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి: బండారు

కొత్తపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యల పరిష్కారానికి కృషి చేసి అభివృద్ధి చేస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం ఆయన కళాశాల పరిసరాలను పరిశీలించి అధ్యాపకులతో సమావేశమయ్యారు. బాలికల మరుగుదొడ్లకు నీటి తాగునీటి సరఫరాతో పాటు ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం చేపడతామన్నారు. కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మీభాస్కరరావు, పాలూరి సత్యానందం, వాసంశెట్టి సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

కోటిపల్లి హుండీల ఆదాయం రూ.3.28 లక్షలు

కె.గంగవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోటిపల్లి శ్రీఛాయా సోమేశ్వరస్వామి హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. తొమ్మిది నెలల కాలానికి రూ.3,28,836 ఆదాయం వచ్చింది. గత సంవత్సరం కన్నా రూ.41,121 అదనంగా వచ్చింది. ఆలయ తనిఖీ అధికారి ఆర్.బాలాజీరామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో ఈవో జె.భీమశంకరం ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపులో సిబ్బంది, గ్రామ పెద్దలు, సుభాష్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.45 లక్షలు



ఆత్రేయపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2.45 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధర రావు తెలిపారు.





వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం, కోటిపల్లి మండలం సత్యవాడ శివానంద ఆశ్రమంల్లో గీతా పారాయణ చేస్తున్న భక్తులు

ఘనంగా గీతా జయంతి

రాయవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక గీతా మందిరంలో గీతా జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో తెల్లవారుజామున ఐదు గంటల నుంచి భగవద్గీత 18 అధ్యాయాల పారాయణ, నగర సంకీర్తన జరిపారు. పురోహితుడు అంగర జనార్దనాచార్యులు ఆధ్వర్యంలో సత్తి విజయభాస్కర రెడ్డి-స్వాతి దంపతులు గీతాయజ్ఞం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ గీతాశ్రమానికి చెందిన దివ్యానంద భారతిస్వామి భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. మానవజాతికి భగవద్గీత నిఘంటువని, ప్రపంచంలో ఏ గ్రంథానికి లేని ప్రత్యేకత దీనికి ఉందని, గీతాసారం తెలుసుకుని ఉత్తమ మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. హరినామ సంకీర్తన వల్ల కలిగే శుభాలను వివరించారు. శ్రీకృష్ణతత్వంపై ఇటికిరాల సుబ్రహ్మణ్య శర్మ ప్రసంగం ఆకట్టుకుంది. నాగులపల్లి వీర వెంకట సత్యనారాయణ, పడాల శివ మణికంఠరెడ్డి, సత్సంగ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గీతా జయంతి కనుల పండువగా జరిగింది. తణుకుకు చెందిన మహిళా మండలి ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు భగవద్గీత పారాయణ చేశారు.

కె.గంగవరం (ఆంధ్రజ్యోతి): సత్యవాడలోని శివానంద ఆశ్రమంలో పోలిశెట్టి వెంకట్రావు మాస్టారు ఆధ్వర్యంలో మహిళలు హోమ సహిత గీతా పారాయణ చేశారు. గీతా జయంతి నుంచి త్రయోదశి వరకు 18 రోజులు 18 అధ్యాయాలను హోమ సహితంగా పారాయణ చేస్తామని నిర్వాహకులు చెప్పారు.

ద్రాక్షారామ (ఆంధ్రజ్యోతి): స్థానిక గీతా మందిరంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు గీతా పారాయణ చేశారు. రామచంద్రపురం వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మహిళలు సామూహిక గీతా పారాయణ చేశారు. బీజేపీ నాయకుడు కొట్టువాడ హరిబాబు, సలాది సతీష్‌నాయుడు, కురపాకుల వెంకటరమణ పాల్గొన్నారు.

ఆలమూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ఆలయాల్లో పూజలు, గీతా పారాయణ నిర్వహించారు. పెదపళ్లలోని శ్రీరుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు పెదపూడి సత్తిబాబు భగవద్గీతకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మహిళలు గీతా పారాయణ చేశారు.



రాయవరం మండలం వెదురుపాకలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు



రాయవరం మండలం వెదురుపాకలో గీతా పారాయణ చేస్తున్న భక్తులు



ఆలమూరు మండలం పెదపళ్లలో రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి

నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

కె.గంగవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలకు రిటర్నింగ్ అధికారి, తహసీల్దారు బండి మృత్యుంజయరావు బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఇరిగేషన్ ఏఈ బీవీ సుబ్రహ్మణ్యంతో కలిసి నోటీసు బోర్డులో నోటిఫికేషన్ పత్రాలు అతికించారు. మండలంలోని ఆరు నీటి సంఘాలకు ఈ నెల 14న ఎన్నికలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు గ్రామాల్లో దండోరా వేయిస్తున్నామని చెప్పారు.



శ్రీపుష్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

వైభవంగా శ్రీపుష్పోత్సవం

కపిలేశ్వరపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగరలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శ్రీపుష్పోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. తొలుత కొమాళ్ళపల్లి సత్యనారాయణమూర్తి కుమారులు సుబ్రహ్మణ్యం, వెంకట్రావు అర్చక పర్యవేక్షణలో శ్రీకంఠం మల్లేశ్వరశర్మ బ్రహ్మత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఈవో రాంబాబురెడ్డి పర్యవేక్షణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలతో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ఆళ్వార్

తిరు నక్షత్ర పూజలు

ఆత్రేయపురం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంచేసియున్న ఆళ్వార్ సన్నిధిలో తిరు నక్షత్ర ఉత్సవాలు బుధవారం మూడో రోజుకు చేరుకున్నాయి. తిరుమంగై ఆళ్వార్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ప్రాకారోత్సవం జరిపి ద్రవిడ వేద పారాయణం చేశారు. ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.





కె.గంగవరం మండలం పామర్రు సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో అఖిల, రాయవరం మండలం చెల్లూరు సదస్సులో మాట్లాడుతున్న జేడీ బోసుబాబు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి: ఆర్డీవో అఖిల

కె.గంగవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల కోరారు. బుధవారం పామర్రు, యండగండి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పామర్రులో జరిగిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏ సమస్య పరిష్కారానికి ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో తహసీల్దారు బండి మృత్యుంజయరావు వివరించారు. మండల ప్రత్యేకాధికారి ఏపీ రంగారావు, ఆర్ఐ వెంకట్రావు, వీఆర్వోలు భద్రరావు, పామర్తి బాబి, రైతులు పాల్గొన్నారు.

రాయవరం (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ జేడీ వి.బోసుబాబు పిలుపునిచ్చారు. చెల్లూరులో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. 14 మంది రైతులు ఫిర్యాదులు అందించారు. మండల ప్రత్యేక అధికారి కేఎస్ దొర, తహసీల్దారు ఐపీ శెట్టి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరు గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ దాసి మీనాకుమారి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో మండల ప్రత్యేకాధికారి, డీఎల్డీవో కామేశ్వరరావు, తహసీల్దారు చిన్నారావు రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి ఆన్‌లైన్ చేశారు. అధికారులు, సిబ్బంది కొద్దిసేపు గ్రామంలో పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సదస్సులో ఆర్ఐ అర్జమ్మ, కార్యదర్శి సత్తిబాబు, దేవస్థానం ప్రతినిధి కామేశ్వరరావు, వీఆర్వోలు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

కొత్తపేట ఎమ్మెల్యే బండారు



ఎక్స్‌రే విభాగాన్ని ప్రారంభించి వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవడంతో పాటు వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చూస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందితో సమీక్షించారు. ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక దృష్టిసారించి సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని సూచించారు. రోగులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆసుపత్రిలో వసతులను పరిశీలించారు. కొత్తపేట ఏరియా ఆసుపత్రిగా ఉన్న దీనిని గత ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా గ్రేడ్ తగ్గించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి ఏరియా ఆసుపత్రిగా పునరుద్ధరించాలని కోరతానన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన స్కానింగ్, ఎక్స్‌రే విభాగాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మీభాస్కరరావు, పాలూరి సత్యానందం, వాసంశెట్టి సత్యనారాయణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.దుర్గాప్రసాద్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామన్

దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహించాలి

ఆత్రేయపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ఎంపీడీవో వెంకటరామన్ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంఈవోలు వరప్రసాద్, సాహెబ్, జిల్లా కో-ఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు. దివ్యాంగులను ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. లొల్ల భవిత కేంద్రంలో 24 మంది వున్నారని, మరో పది మంది విద్యార్థులకు ఉచ్చిలిలో ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పలు అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, ఐఈఆర్టీ టీచర్లు అరుణ, జానకి పాల్గొన్నారు.

కారు ప్రమాదంలో ముగ్గురి మృతి బాధాకరం
మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతావారిపేట వద్ద కారు ప్రమాద ఘటనపై పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజుతో మంత్రి సుభాష్ ఫోనులో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒకే కుటుంబానికి చెందిన నేలపూడి ఉమ, పిల్లలు రిషి, మనోజ్ మృత్యువాతపడడం విచారకరమని అన్నారు. వారి కుటుంబానికి మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నివాస గృహాల మధ్యలో దుబ్బులు తొలగింపు

ఆత్రేయపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలం వాడపల్లిలో నివాసాల మధ్యలో దేవస్థానానికి చెందిన 50 సెంట్ల భూమిలో దుబ్బులు పెరిగిపోయి విషసర్పాలు సంచరిస్తున్నాయి. దీనిపై దేవస్థానం అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఉప కమిషనరు చక్రధరరావు వెంటనే సిబ్బందిని పంపించి ఎక్స్‌కవేటరు సాయంతో దుబ్బులు తొలగింపజేసి శుభ్రం చేయించారు.





రావులపాలెం, కె.గంగవరంల్లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

15న గుంటూరులో మాలల మహాగర్జన

రావులపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈ నెల 15న జరిగే మాలల మహాగర్జన సభను విజయవంతం చేయాలని మాల మహానాడు కోనసీమ జిల్లా నాయకుడు పీవీ రావు పిలుపునిచ్చారు. రావులపాలెం ఇందిరా కాలనీలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో అంబేడ్కర్‌వాది చిక్కాల సత్యప్రసాద్, కోనాల అంబేడ్కర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు పార్టీలకు అతీతంగా తరలిరావాలన్నారు. అఖిల భారత మాల సంఘాల జేఏసీ వైస్ చైర్మన్ పండు అశోక్‌కుమార్, పెయ్యిల పరశురాముడు, నాతి శ్రీనివాస్, జక్కల అరుణ్‌కుమార్, గుమ్మాపు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం (ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈ నెల 15న జరిగే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు కోరారు. ఆయన కె.గంగవరంలో మాల మహానాడు నాయకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. జంగా బాబూరావు, పాలమూరు మోహన్‌బాబు, రేవు తిరుపతిరావు, రవ్వా భూషణం, పెట్టా శ్రీనివాసరావు, కోటి వెంకట్రావు, తరపట్ల ఆనందరావు, జంగం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రిక ఆవిష్కరణ



రావులపాలెం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పారా సంస్థ ఆధ్వర్యంలో వరద, విపత్తుల సమయంలో సిద్ధంగా ఉండే చర్యలపై రూపొందించిన అవగాహన గోడ పత్రికను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆవిష్కరించారు. రావులపాలెంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.